క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: విద్యుత్ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్ మారుస్తున్నందున కాజీపేటలోని పలు ప్రాంతాల్లో ఈనెల 10న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీఎస్ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కాజీపేట జూబ్లీ మార్కెట్ ఏరియా విద్యానగర్‌లోని సెయింట్ ఆన్స్ స్కూల్ వెనుక ప్రాంతంలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు.

లైబ్రరీకి పుస్తకాల వితరణ



హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని జిల్లా గ్రంథాలయానికి రూ.5వేల విలువైన పుస్తకాలను రిటైర్డ్ ఉపాధ్యాయురాలు అరుణ, నాగేందర్‌రెడ్డి దంపతులు గురువారం అందజేశారు. ఈమేరకు వారిని గ్రంథాలయ చైర్మన్ అజీజ్‌ఖాన్, తదితరులు అభినందించారు. కార్యక్రమంలో సంపత్‌రావు, సృజన్‌కాంత్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు బ్యాగుల పంపిణీ



కాజీపేట: కాజీపేట 62వ డివిజన్ విష్ణుపురిలోని రైల్వే పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో 2వేల మంది సభ్యులకు ట్రావెలింగ్ బ్యాగులను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైల్వే సీనియర్ డీఎస్ ప్రాంజల్ కేశ్వని, సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కె.సంగమయ్య, కెవి.రావు, బి.యాదయ్య, ఎండి జహంగీర్, సభ్యులు హాజరయ్యారు.

నిత్యజీవితంలో యోగా ఓ భాగం



కాజీపేట అర్బన్: నిత్యజీవితంలో ప్రతిఒక్కరు యోగాను ఓ భాగంగా మలచుకోవాలని జాతీయ యోగా ట్రైనర్ కృష్ణానాయక్ తెలిపారు. దేశ పర్యటనలో భాగంగా కాజీపేట మండలం న్యూశాయంపేటలోని కృష్ణానాయక్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించి విద్యార్థులకు యోగాలోని మెళకువలు నేర్పించి మాట్లాడారు. సంపూర్ణ ఆరోగ్యానికి, లక్ష్య సాధనకు విద్యార్థులు ప్రతిరోజు యోగా సాధన చేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ఎంఎం.స్వామి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు



హన్మకొండ అర్బన్: ఈఎంఆర్ఐ గ్రీన్‌హెల్త్ 108 అత్యవసర సర్వీసుల్లో పోస్టుల భర్తీకి గురువారం హనుమకొండ కలెక్టరేట్ ఆవరణలోని గెజిటెడ్ అధికారుల సంఘం భవనంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. పైలట్ పోస్టుకోసం 20మంది, ఈఎంటీకి 18మంది హాజరైనట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ పాటి శివకుమార్ తెలిపారు. ఎంపికైన వారికి త్వరలో శిక్షణ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆపరేషన్స్ హెచ్ఆర్ వెంకటరమణ, ప్రతినిధులు హరీష్, చంద్రశేఖర్, రాము, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ఉద్యమకారులకు ప్రభుత్వం న్యాయం చేయాలి

వరంగల్: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నుంచి నేటి ప్రత్యేక తెలంగాణ వరకు ఉద్యమంలో పాల్గొన్న కళాకారులకు న్యాయం చేయాలని ప్రజానాట్య మండలి రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉప్పలయ్య కోరారు. ఈమేరకు నిమ్మాయిచెరువు వద్ద బండారి లక్ష్మి అధ్యక్షతన గురువారం జరిగిన జిల్లాస్థాయి శిబిరాల్లో ఆయన మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో కళాకారులు తమ ఆటపాటలతో తెలంగాణ ప్రజలను చైతన్యం చేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా నిర్మాణ బాధ్యులు రమేష్, దామర కృష్ణ, రవి, సుధీర్, సమ్మయ్య, సుప్రియ, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఎఫ్ అధ్యక్షుడిగా లక్ష్మణ్



హసన్‌పర్తి: మాదిగ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (ఎంఈఎఫ్) హసన్‌పర్తి మండల అధ్యక్షుడిగా జన్ను లక్ష్మణ్ నియమితులయ్యారు. ఈమేరకు ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు మంద రాజు ప్రకటించారు.

ఆధ్యాత్మిక కేంద్రంగా కాజీపేట

- వలు ఆలయాల్లో కొలువుదీరిన దేవతామూర్తులు
- భక్తుల నిత్య పూజలు
- సత్రాల్లో అన్నదానాలు



కాజీపేటలోని శివాలయం



సోమిడిలో కొలువుదీరిన మహా శివుడు



శ్వేతార్క మూలగణపతి దేవాలయం



పూజలు చేస్తున్న భక్తులు

కాజీపేట: ట్రిసిటీలో ఒకటిగా పిలువబడే కాజీపేట పట్టణం నానాటికి ఆధ్యాత్మిక కేంద్రంగా రూపుదిద్దుకుంటోంది. ఆరు డివిజన్లు.. సుమారు లక్ష జనాభా కలిగిన పట్టణంలో చుట్టూ ఆలయాలే దర్శనమిస్తున్నాయి. పట్టణ ప్రజలు, భక్తులు చందాలు పోగేసుకుని ఆలయాలు నిర్మించుకున్నారు. ఇప్పుడిప్పుడే అన్ని రంగాల్లోనూ ఎదుగుతున్న చిన్న పట్టణంలో సుమారు 30కి పైగా దేవాలయాలు ఉన్నాయి. ప్రతిరోజు ఆలయాల్లో పూజలు, అభిషేకాలు నిర్వహించడంతో పాటు అనేక ఆధ్మాత్మిక కార్యక్రమాలు జరుగుతున్నాయి.

నిత్యం భక్తుల రాక

పట్టణ ప్రజలే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి కాజీపేట పట్టణ ప్రాంతానికి వచ్చే వారంతా ఏదో ఒక ఆలయాన్ని దర్శించుకుని వెళ్లడం ఆనవాయితీగా మారింది. ఆలయాల్లో నిత్య పూజలు నిర్వహించేందుకు అర్చకులను స్థానికులు నియమించుకున్నారు. వారంతా ఆలయాల్లో ఉదయం నుంచి రాత్రి వరకు పూజలు, అభిషేకాలు, అర్చనలు చేస్తుంటారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధిగాంచిన స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రం కాజీపేటలోనే ఉంది. దాదాపు వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన భ్రమరాంబిక మల్లిఖార్జున స్వామి దేవాలయం ఉంది. ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి, రామాలయం, షిర్డీ సాయిబాబా, రాధాకృష్ణ, పంచముఖ ఆంజనేయ స్వామి, శివాలయం, మహంకాళమ్మ, అభయాంజనేయస్వామి, రేణుక ఎల్లమ్మతల్లి, నవగ్రహాలు, వెంకటేశ్వరస్వామి, గ్రామ దేవతలు, సుబ్రహ్మణ్యస్వామి వంటి అనేక ఆలయాలు ఉన్నాయి. దీంతో కాజీపేట పట్టణం ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతోంది.

ఉట్టిపడుతున్న ఆధ్యాత్మిక శోభ

పట్టణ ప్రజలంతా ఒకే మాటపై కట్టుబడిఉండి ఆలయాలు ఏర్పాటు చేసుకున్నారు. భవిష్యత్తులో ఇంకా అనేక ఆలయాలు ఏర్పాటు చేసుకునేందుకు ప్రణాళికలు రూపొందించుకుంటున్నారు. ఇదిలాఉంటే, మహంకాళమ్మ, శ్వేతార్క మూలగణపతి, అయ్యప్పస్వామి, ఆంజనేయస్వామి, వెంకన్న ఆలయాల్లో ప్రత్యేక ఉత్సవాలు, దేవతామూర్తుల కల్యాణ వేడుకలు జరుపుతుండడంతో భక్తులు భారీగా తరలి వస్తుంటారు. ఆయా సందర్భాల్లో కాజీపేట ప్రత్యేక శోభను సంతరించుకుంటోంది. ఆధ్యాత్మికతను ప్రతిఒక్కరూ పెంపొందొచుకునేందుకు మరిన్ని ఆలయాలను ఏర్పాటు చేసుకుంటున్నట్లు భక్తులు చెబుతున్నారు.

ఆధ్యాత్మికత అలవడుతోంది



ఆలయాల ఏర్పాటుతో ప్రతిఒక్కరిలో ఆధ్యాత్మికత అలవడుతోంది. ప్రతి రోజూ ఏదో ఒక ఆలయానికి వెళ్లి రావడం వల్ల మనసు ప్రశాంతంగా ఉంటుంది. ఆలయాల ఏర్పాటుకు సమష్టిగా పని చేస్తాం. అందువల్లనే ఎక్కువగా ఆలయాలను నిర్మించుకుంటున్నాం.

– మోడెం సురేందర్, సోమిడి

నిత్య పూజలు జరుగుతాయి



శ్వేతార్క మూలగణపతి దేవాలయ ప్రాంగణంలోనే 29 దేవతామూర్తులు కొలువుదీరి ఉండడం విశేషం. ప్రతిఏటా రెండు దఫాలుగా ఆలయంలో ఉత్సవాలు సాగుతాయి. నిత్య అన్నదానం కొనసాగుతోంది. భక్తుల ఆదరణ బాగుంటోంది.

– అయినవోలు అనంతమల్లయ్య శర్మ సిద్ధాంతి

భారీ పరిశ్రమల సాధనే లక్ష్యంగా సీపీఐ పాదయాత్ర



కరపత్రాలు పంచుతున్న నాయకులు

కాజీపేట: కాజీపేటలో భారీ పరిశ్రమలు, బయ్యారంలో ఉక్కు పరిశ్రమ స్థాపించాలనే డిమాండ్‌తో పాదయాత్ర నిర్వహించాలని సీపీఐ నిర్ణయించినట్లు జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్ తెలిపారు. కాజీపేట పట్టణంలో గురువారం కార్యకర్తలతో కలిసి ఉద్యమానికి అవసరమైన నిధుల సేకరణ ప్రయత్నాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 17వ తేదీ నుంచి ఏప్రిల్ 17వరకు పాదయాత్ర కొనసాగుతుందని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై రాజకీయంగా తీవ్ర ఒత్తిడి తీసుకొచ్చి పరిశ్రమలను సాధించాలనే లక్ష్యంతో చేపట్టిన పాదయాత్రకు ప్రతిఒక్కరూ సహకరించాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మునిగాల భిక్షపతి, ఈగ లావణ్య, బండ రాధిక, రాసమల్ల లక్ష్మి, పూర్ణచందర్, మద్దెల సంధ్య తదితరులు పాల్గొన్నారు.

ఫాతిమా స్కూల్ వార్షికోత్సవం



జడ్జి పద్మజను సన్మానిస్తున్న హెచ్ఎం అరుణ

కాజీపేట రూరల్: కాజీపేట ఫాతిమానగర్‌లోని ఫాతిమా ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు చదువుతో పాటు ఇతర రంగాల్లోనూ రాణిస్తున్నారని ఫ్యామిలి కోర్టు జడ్జి పద్మజ కొనియాడారు. ఫాతిమా హైస్కూల్ వార్షికోత్సవం గురువారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జడ్జి పద్మజ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ జిల్లాలో పురాతనమైన పెద్ద స్కూల్ ఫాతిమానగర్ స్కూల్ అని గుర్తుచేశారు. అనంతరం జడ్జిని స్కూల్ ప్రిన్సిపాల్ అరుణ, ఉపాధ్యాయులు సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఏసీజీ చలపతిరావు, హెడ్‌మాస్టర్ అరుణ, కరస్పాండెంట్ అనిత, ఫాదర్లు క్షవేరి, స్టెఫెన్, బబురా, మర్రెడ్డి, ఆంటోని, జెరోమ్ పాల్గొన్నారు.

భట్టి వ్యాఖ్యలను ఖండిస్తున్నాం..



సమావేశంలో మాట్లాడుతున్న మల్లేషం

హన్మకొండ చౌరస్తా: మత్స్య సహకార సంఘాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు సభ్యత్వం కల్పించాలని అసెంబ్లీ సాక్షిగా సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలను మత్స్య సహకార సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు బుస్సా మల్లేషం ఖండించారు. హనుమకొండ ములుగురోడ్డు సమీపంలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో మల్లేషం మాట్లాడారు. 98, 74 జీఓలను మార్చాలని మంత్రికి భట్టి విక్రమార్క నివేదించడాన్ని ముదిరాజ్, బెస్తల తరఫున తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. అనాదిగా చేపల వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న ముదిరాజ్, బెస్తలను రక్షించేందుకు తీసుకొచ్చిన జీఓలను మార్చాలనే ఆలోచన సరైంది కాదని ఆయన సూచించారు. సంప్రదాయ ముదిరాజ్, బెస్త కులాలకు పూర్తి హక్కులు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో నీరటి సదానందం, రాజు తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని సీపీకి ఆహ్వానం



సీపీ విశ్వనాథ్‌కు మహాశివరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేస్తున్న గంగు ఉపేంద్రశర్మ

హన్మకొండ కల్చరల్: రుద్రేశ్వరస్వామి వేయిస్తంభాల దేవాలయంలో ఈనెల 17నుంచి 21వ తేదీ వరకు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని నగర పోలీస్ కమిషనర్ ఏవీ.రంగనాథ్‌ను తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ రాష్ట్ర చైర్మన్, వేయిస్తంభాల దేవాలయం ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ ఆహ్వానించారు. ఈమేరకు పోలీస్ కమిషనరేట్‌లో సీపీని గంగు ఉపేంద్రశర్మ గురువారం కలిసి రుద్రేశ్వరస్వామి ప్రసాదాలు వితరణ చేసి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందించారు.

బీసీ మంత్రులు రాజీనామా చేయాలి



నిరసన తెలుపుతున్న బీసీ జేఏసీ బాధ్యులు

కేయూ క్యాంపస్: తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో బీసీల సంక్షేమానికి తక్కువగా నిధులు కేటాయించినందుకు బాధ్యత వహిస్తూ బీసీ మంత్రులు తమ పదవులకు రాజీనామా చేయాలని బీసీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ తిరుణహరి శేషు డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలోని దూరవిద్యా కేంద్రం ఆవరణలోని పూలే దంపతుల విగ్రహాల వద్ద గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ విద్యార్థులకు పూర్తిగా ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించడం లేదని, బీసీలకు వ్యక్తిగత రుణాలు ఇవ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. నిరసన కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు దారబోయిన సతీష్, చిన్నాల, యశ్వంత యాదవ్, ఎర్రబొజ్జు రమేష్, రాము, డేనియల్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఎంటర్‌ప్రెన్యూర్లుగా రాణించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న తిరుమల్‌రావు

హసన్‌పర్తి: ప్రతివిద్యార్థి ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించాలని ఎస్వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు అన్నారు. భీమారంలో ఎస్వీఎస్ ఇంజనీరింగ్ కళాశాలలో 'వర్క్‌షాప్ ఫర్ ప్రొఫెషనల్ స్టూడెంట్స్' అనే అంశంపై రెండు రోజుల పాటు కొనసాగనున్న సదస్సు గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కారు ఉద్యోగాలపై ఆధారపడకుండా పదిమందికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. ఈక్రమంలో విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలని సూచించారు. ఎస్వీఎస్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి సువర్ణ మాట్లాడుతూ కళాశాలలో మరిన్ని సెమినార్లు నిర్వహిస్తామని తెలిపారు. ప్రతిమ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బోయినపల్లి ప్రతీక్, డాక్టర్ ఎర్రబెల్లి హర్షిణి, స్కిల్స్ స్టోర్క్ ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ ఎర్రబెల్లి అనూప్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు నూతన ఆవిష్కరణాల వైపు దృష్టి సారించాలన్నారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

హౌస్ కీపింగ్ వర్కర్లను పనిలోకి తీసుకోవాలి



దీక్షలో కూర్చున్న హౌస్ కీపింగ్ వర్కర్లు

హన్మకొండ: వరంగల్ జిల్లా కోర్టులో తొమ్మిది సంవత్సరాల నుంచి పనిచేస్తున్న హౌస్ కీపింగ్ వర్కర్లను తిరిగి పనిలోకి తీసుకోవాలని టీఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల భిక్షపతి మాదిగ, సీఐటీయూ జిల్లా నాయకుడు టి.ఉప్పలయ్య, కార్మిక సంఘాల జేఏసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ధర్మరాజు డిమాండ్ చేశారు. ఈమేరకు టీఎమ్మార్పీఎస్, సీఐటీయూ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద చేపట్టిన దీక్షలు గురువారం మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కోర్టు కాంట్రాక్టర్ గొట్టిపాటి రామచంద్రరావు.. అకారణంగా కార్మికులను తొలగించడంతో పాటు, కార్మికుల నుంచి పీఎఫ్, ఈఎస్ఐ పేరుతో డబ్బులు వసూలు చేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నించినందుకు 2022, ఆగస్టు 3న ముందస్తు సమాచారం లేకుండా 11మంది వర్కర్లను కాంట్రాక్టర్ తొలగించాడని తెలిపారు. అనంతరం, హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను కలిసి వినతిపత్రం అందించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు మున్నంగి రఘు, బరుపట్ల మహేష్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఉర్సు ఉత్సవాలకు పటిష్ట ఏర్పాట్లు



మాట్లాడుతున్న పీఠాధిపతి నవీద్‌బాబా

కరీమాబాద్: ఉర్సు దర్గాలో ఈనెల 13 నుంచి 15వరకు జరగనున్న 467వ ఉత్సవాల (హజ్రత్ సయ్యద్ జలాలుద్దీన్ జమాముల్ బహర్, సయ్యదనా మాషుక్ రబ్బానీ)కు అన్ని ఏర్పాట్లు చేయనున్నట్లు దర్గా పీఠాధిపతి నవీద్‌బాబా, ఉబేద్‌బాబా తెలిపారు. ఈమేరకు ఉత్సవాల వాల్‌పోస్టర్లను దర్గా ప్రాంగణంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వందల సంవత్సరాల చరిత్ర కలిగిన దర్గా ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఫకీర్ల విన్యాసాలతో 13వ తేదీ రాత్రి ఉర్సు నయా ఘడీలోని గంధాన్ని తీసుకువచ్చి పవిత్ర సమాధికి (గంధలేపనం) పూయనున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే వేడుకలకు పలు ప్రాంతాల నుంచి సుమారు 10లక్షల మంది భక్తులు హాజరయ్యే అవకాశముందని తెలిపారు.

కమీషన్లపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదు



నాయినిని సన్మానిస్తున్న కాంగ్రెస్ నాయకులు

హన్మకొండ చౌరస్తా: బీఆర్ఎస్ నాయకులకు ప్రజల సొమ్మును దోచుకోవడం, కమీషన్లు, పర్సంటేజీలు పంచుకోవడంపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదని డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి ధ్వజమెత్తారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా 4వ డివిజన్‌లో గురువారం పర్యటించారు. ఇంటింటికీ తిరగుతూ స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను కరపత్రాల ద్వారా ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రెస్‌క్లబ్ వేదికగా జరిగిన జర్చలో మధ్యలో పారిపోయిన చరిత్ర బీఆర్ఎస్ నాయకులదని ఎద్దేవాచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు బాషబోయిన శ్రీధర్, నాయకులు అంబేద్కర్ రాజు, రాజేందర్, నసీం జహాన్, గాండ్ల స్రవంతి, బాషబోయిన కుమార్, మహ్మద్ గౌస్, అశోక్, బంక సరళ, బొమ్మతి విక్రం, డాక్టర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దేశ భవిష్యత్ యువతపైనే ఆధారపడి ఉంది



సమావేశం అనంతరం నినదిస్తున్న నాయకులు

న్యూశాయంపేట: దేశ భవిష్యత్ యువతపైనే ఆధారపడి ఉందని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ వలివుల్లాఖాద్రీ అన్నారు. హనుమకొండ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం ప్రశాంత్ యాదవ్ అధ్యక్షతన గురువారం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ ఏడాదికి కోటి ఉద్యోగాలు ఇస్తామని కేంద్రం చేసిన హామీలు నెరవేరలేదని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతను దృష్టిలో పెట్టుకుని ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ హనుమకొండ కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా కే.ప్రశాంత్, కోకన్వీనర్‌గా కుమారస్వామిను ఎన్నుకోగా, ఈ కార్యక్రమంలో రాజు, రవి, మహేష్, మతిన్, అలీమ్, నవీన్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

ఏసీపీకి సన్మానం



కరీమాబాద్ / ఖిలా వరంగల్: వరంగల్ ఏసీపీగా పనిచేసి బదిలీపై వెళ్తున్న కలకోట గిరికుమార్‌ను ముస్లిం పెద్దలు గురువారం సన్మానించారు. గ్రేటర్ పరిధిలోని 41వ డివిజన్ శంభునిపేటలో జరిగిన వీడ్కోలు సమావేశంలో ఏసీపీని సత్కరించి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో జబ్బార్, చాంద్‌పాషా, అహ్మద్, అమీర్, ఖలీం, సాలర్ అజీమ్ మౌలానా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వివిధ పోటీలు

విద్యారణ్యపురి: తెలంగాణ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి (టీఎస్‌కాస్ట్) రీజినల్ సైన్స్‌సెంటర్ ఆధ్వర్యంలో హనుమకొండ ప్రభుత్వ మార్కజీ హైస్కూల్‌లో నేషనల్ మ్యాథ్‌మెటిక్స్ డేను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. అనంతరం, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉమ, రిసోర్స్ పర్సన్ సోమయ్య, రీజినల్ సైన్స్ సెంటర్ సిబ్బంది వెంకటేశ్వర్‌రావు, అభినవ్, సబిత, ఉపాధ్యాయులు మధుసూదన్‌రెడ్డి, వేణుగోపాల్ పాల్గొన్నారు.

డివిజన్‌వాసుల కోసమే ఆరోగ్యకేంద్రం

హసన్‌పర్తి: డివిజన్ ప్రజల కోసమే ఆరోగ్యకేంద్రాన్ని నిర్మిస్తున్నట్లు కార్పొరేటర్ జక్కుల రజిత అన్నారు. బఫర్ జోన్‌లో నిర్మాణం పేరిట కొంతమంది అభివృద్ధిని అడ్డుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. భీమారంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మట్లాడారు. తన సొంత ప్రయోజనాల కోసం ఆరోగ్య ఉపకేంద్రాన్ని నిర్మించడం లేదని అన్నారు. స్థానికంగా సబ్‌సెంటర్ లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

న్యూశాయంపేట: 36వ డివిజన్ చింతల్ ప్రాంతంలోని భక్త హనుమాన్ దేవస్థానం ఆధ్వర్యంలో పంచాయతన రామలింగేశ్వరస్వామి, లలిత త్రిపుర సుందరిదేవి, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, రాష్ట్ర నాయకుడు వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవాడలో ఆయుష్మాన్ భారత్ కేంద్రం

వరంగల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ నమోదు కేంద్రాన్ని 23వ డివిజన్‌లోని కొత్తవాడలో స్థానిక కార్పొరేటర్ ఆడెపు స్వప్న, బీజేపీ నాయకులు కుసుమ సతీష్, డివిజన్ అధ్యక్షుడు గాదె రవీందర్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, కావ్య తదితరులు పాల్గొన్నారు.

జూడో చాంపియన్‌లో విద్యార్థుల ప్రతిభ

కాశిబుగ్గ: కరీంనగర్‌లో బుధవారం జరిగిన సబ్ జూనియర్ జూడో చాంపియన్ పోటీల్లో కాశిబుగ్గలోని నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గుడిబడి) విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఈమేరకు విద్యార్థులు మేడి చందనశ్రీ, రజతం, సిరిచందన, స్వాతి, పల్లవిని గురువారం అభినందించినట్లు హెచ్ఎం కుంట రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో కోచ్ లింగమూర్తి, పీఈటీ నారాయణ, ఉపాధ్యాయులు కుమారస్వామి, శ్రవణ్, అజయ్‌బాబు, నారాయణ, అశోక్ ఉన్నారు.

ఉపాధ్యాయుడి హఠాన్మరణం

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లా కాజీపేట దర్గా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న దుబ్బాక వేణుగోపాల్ (52) గురువారం ఉదయం గుండెపోటుతో మరణించారు. కాగా, ఆయన టీఎస్‌యూటీఎఫ్ కాజీపేట మండలం కార్యదర్శిగా బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. వేణుగోపాల్ ఆకస్మిక మృతికి టీఎస్‌యూటీఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సదాశివరెడ్డి, జనరల్ సెక్రటరీ పెండెం రాజు, ఉపాధ్యక్షుడు రవీందర్‌రాజు, కోశాధికారి కిరణ్‌కుమార్, బాధ్యులు సదానందం, రాజేంద్రప్రసాద్, శశిధర్‌రెడ్డి, లింగారావు సంతాపం తెలిపారు.

కుమార్‌యాదవ్‌పై కేసు నమోదు

వరంగల్: నగరంలోని 3వ డివిజన్ పైడిపల్లికి చెందిన ఎల్లావుల కుమార్‌యాదవ్‌పై చేపూరి హరికిరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ చేరాలు గురువారం తెలిపారు. పైడిపల్లిలోని లోటస్ సొసైటీలో 35ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన 460గజాల స్థలం చుట్టూ నిర్మించిన ప్రహరీలో కొంతభాగాన్ని బీఆర్ఎస్‌కు చెందిన నాయకుడు కుమార్‌యాదవ్ కూల్చివేశాడని జనవరి 7న హరికిరణ్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మతిస్థిమితం లేని మహిళ అప్పగింత

వరంగల్ క్రైం: మతిస్థిమితం కోల్పోయి రోడ్డుపై తిరుగుతున్న మహిళను చేరదీసి ఆమె తల్లిదండ్రులకు అప్పగించినట్లు హనుమకొండ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌జీ తెలిపారు. పెద్దమ్మగడ్డ ప్రాంతంలో తిరుగుతున్న మహిళను చేరదీసి కాశిబుగ్గలోని మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్ట్‌లో ఉంచి చికిత్స చేయించినట్లు ఆయన తెలిపారు. అనంతరం, వివరాలు తెలుసుకుని ఆమె తల్లిదండ్రులకు అప్పగించారు.

ఆర్ఎంపీకి గాయాలు

హసన్‌పర్తి: హనుమకొండ – కరీంనగర్ ప్రధాన రహదారిలో హసన్‌పర్తి పెద్దచెరువు పెట్రోల్‌పంపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆర్ఎంపీ గాయపడ్డాడు. హుజురాబాద్‌లో ఆర్ఎంపీగా పనిచేస్తున్న బి.సంతోష్.. వ్యక్తిగత పనిమీద బైక్‌పై గురువారం హనుమకొండకు వచ్చి తిరుగు ప్రయాణంలో హుజురాబాద్ వైపుకు వెళ్తుండగా, అదే మార్గంలో వెళ్తున్న ప్రైవేట్ బస్సు అతన్ని ఢీకొంది. దాంతో సంతోష్‌కు తీవ్ర గాయాలు కాగా, అంబులెన్స్‌లో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

యాచక దంపతుల కుమార్తె వివాహానికి చేయూత



పుస్తెలు, మట్టెలు అందజేస్తున్న ఆలయ చైర్మన్

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ గుడిబండల్‌లోని శ్రీరాజరాజేశ్వరీ దేవాలయ ప్రాంగణంలో యాచించే దంపతుల కూతురు వివాహానికి ఆలయ చైర్మన్ పులి విక్రమ్‌కుమార్.. తాళి, మట్టెలు, 50 కిలోల బియ్యాన్ని అందించారు. పద్మాక్షికాలనీలోని లెప్రసీకాలనీకి చెందిన కొమురయ్య, నీలమ్మ దంపతులు దేవాలయం ప్రాంగణంలో భక్తుల వద్ద యాచిస్తూ జీవనం సాగిస్తుంటారు. ఈనెలలో వారి కూతురు పెళ్లి ఉందని తెలుసుకున్న ఆలయ చైర్మన్ చేయూతను అందించారు.